ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
శనివారం 22 ఆగష్టు, 2026 | సంపుటి - 01 సంచిక - 340 | పేజీలు -04 వెల - 5

## ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత

- 94 ఏళ్ల వయసులో తుదిశ్వాస
- ఏడు దశాబ్దాల సినీ ప్రయాణం
- 400కుపైగా చిత్రాల్లో నటించిన జానకి
- సంతాపం తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి



3లో

# ఆ అవమానమే నన్ను ఎమ్మెల్యేను చేసింది



- బిజినెస్‌మెన్ కావాలనేది నా చిన్నప్పటి కల
- అన్న ప్రణయ్‌భాస్కర్ రాజకీయాల్లో.. నేను తెరవెనుక
- ఓటములు ఎన్నైనా.. ఎమ్మెల్యే కావాలన్న పట్టుదల వీడలేదు
- కేసీఆర్‌తో పరిచయం..నా జీవితంలో అత్యంత కీలకమైన మలుపు
- ఆర్థిక సంబంధాలతో కాదు.. మానవ సంబంధాలతో గెలిచా
- 2029లో మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తా.. రిటర్న్ గిఫ్ట్ ఇస్తా..!

...తరువాయి 4 లో

'రాజకీయాల్లోకి రావాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. మంచి బిజినెస్‌మెన్‌గా ఎదగాలనుకున్నా. అన్నయ్య ప్రణయ్‌భాస్కర్ రాజకీయాల్లో ఉన్నప్పుడు ఆయనకు తెర వెనుక నుంచి సహకరించేవాడిని. కానీ ఆయన మరణం తర్వాత హైదరాబాద్‌లో ఎమ్మెల్యే క్వార్టర్ వద్ద ఎదురైన అవమానం నా జీవితాన్నే మార్చేసింది. 'పదవి లేకపోతే ఇంత అవమానమా?' అన్న ఆలోచన నాలో కసిని పెంచింది. ఎమ్మెల్యే అయ్యాకే మళ్లీ అక్కడికి వస్తానని అప్పుడే నిర్ణయించుకున్నా. ఆ తర్వాత ఓటములు వచ్చాయి.. అడ్డంకులు ఎదురయ్యాయి.. అయినా వెనక్కి తగ్గలేదు. ప్రజలను, కార్యకర్తలను, కార్మికులను నమ్ముకున్నా. చివరకు ఎమ్మెల్యే అయ్యా. ఇప్పుడు కూడా నేను సీరియస్ పొలిటికల్ లీడర్‌నే. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా.. ఖచ్చితంగా గెలుస్తా'' అని మాజీ ఎమ్మెల్యే, మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. తన బాల్యం నుంచి వ్యాపారంపై ఉన్న ఆసక్తి, అన్న ప్రణయ్‌భాస్కర్‌తో అనుబంధం, తనను రాజకీయాల్లోకి నడిపించిన ఆ ఒక్క ఘటన, వరుస ఓటములు, కేసీఆర్‌తో పరిచయం, టీఆర్ఎస్‌తో ప్రయాణం, ప్రజలు-కార్మిక సంఘాలతో ఏర్పడిన మానవ సంబంధాలు, ఉద్యమకారులకు చేసిన సాయం, కల్పలత సూపర్‌బజార్‌తో అనుబంధం, రాజకీయ ప్రత్యర్థులపై తన వైఖరి, కుటుంబ జీవితం, భవిష్యత్ రాజకీయ లక్ష్యాల వరకు ఇంతకుముందు పెద్దగా బయటకు చెప్పని అనేక విషయాలను డిజిటల్ మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పంచుకున్నారు.ఆ వివరాలు ఆయన మాటల్లోనే..!

### శ్రీశైలం నీటిని ఏపీ తరలిస్తున్నా..
# చూస్తూ ఊరుకుంటారా?



- సాగర్ నీటిపై జిల్లా మంత్రులు సమాధానం చెప్పాలి
- పోతిరెడ్డిపాడు ద్వారా 148 టీఎంసీల తరలింపు
- ఎడమ కాల్వ, లిఫ్టులకు వెంటనే నీళ్లు విడుదల చేయాలి
- నీటి వాటా సాధించేంత వరకు రైతుల తరపున పోరాడుతాం
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

కాకతీయ, నల్లగొండ : శ్రీశైలం నుంచి ఆంధ్రప్రదేశ్ నిత్యం నీటిని తరలించుకుపోతున్నా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. వారి నిర్లక్ష్యం వల్లే జిల్లాలో వ్యవసాయం ఆగమవుతోందని ఆరోపించారు. సాగర్‌లో 532 అడుగుల నీటిమట్టం ఉందని, సుమారు 30 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఎడమ కాల్వకు నీరు విడుదల చేయకపోవడానికి కారణమేంటో జిల్లా మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీశైలంలోకి వరద వస్తున్నా ఆ నీరు పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రాకు తరలిపోతోందని ఆరోపించారు. రైతుల నీటి వాటా కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

...తరువాయి 2 లో

## మంత్రులకు సీఎం
# టార్గెట్‌అయ్యారా..?

- మంత్రుల మౌనం దేనికి సంకేతం?
- సుస్మిత వ్యాఖ్యలపై మంత్రులు మౌనంగా ఉండటంపై సందేహాలు
- సీఎంకు ఎమ్మెల్యేల మద్దతు.. మంత్రుల నుంచి స్పందన కరువు
- సొంత శిబిరం నుంచే విమర్శలు వచ్చినా ఎందుకీ మౌనం?
- క్రమశిక్షణపై చర్చ.. అధిష్ఠానం వైఖరిపై ఆసక్తి
- సీఎం రాక తర్వాతే అసలు పరిణామాలా?

...తరువాయి 2 లో



కాకతీయ, తెలంగాణ బ్యూరో : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర వ్యాఖ్యలపై కాంగ్రెస్ మంత్రులు మౌనం వహించడం ఇప్పుడు పార్టీలో కొత్త చర్చకు దారితీసింది. సీఎంపై సొంత శిబిరం నుంచే బహిరంగ విమర్శలు వచ్చినా.. మంత్రులు మాత్రం ఎందుకు స్పందించలేదు? ముఖ్యమంత్రిని రాజకీయంగా సమర్థించాల్సిన మంత్రులు మౌనం వహించడం వెనుక ఏదైనా అసంతృప్తి ఉందా? మంత్రులే సీఎంను టార్గెట్ చేస్తున్నారా? అన్న సందేహాలు కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సుష్మిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మహిళా నేతలు బహిరంగంగా ముందుకు రావడం గమనార్హం. ముఖ్యమంత్రికి అండగా నిలిచేందుకు కింది స్థాయి నేతలు స్పందిస్తున్నా.. మంత్రుల నుంచి మాత్రం అదే స్థాయిలో స్పందన లేకపోవడంపై పార్టీలో చర్చ సాగుతోంది. దీంతో మంత్రివర్గంలో అంతర్గత సమన్వయం, సీఎంపై మంత్రుల వైఖరి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం నో

- బ్రిటన్ పర్యటనకు మాత్రమే క్లియరెన్స్
- అమెరికా పర్యటన ప్రతిపాదన పదవికి, ఉద్దేశానికి అనుగుణంగా లేదు
- లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు సీఎం
- సీఎం పర్యటనపై విదేశీ వ్యవహారాల శాఖ వివరణ



కాకతీయ, హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ..

...తరువాయి 2 లో

# యోగితో బండి భేటీ



- అరగంటకుపైగా సాగిన నేతల సమావేశం
- తెలంగాణలో బీజేపీ పరిస్థితిపై ఆరా
- డబుల్ ఇంజిన్ సర్కారుతో రాష్ట్ర అభివృద్ధి
- మళ్లీ యూపీలో బీజేపీదే అధికారం: యోగి ఆదిత్యనాథ్

2లో



### భూ సమస్యల పరిష్కారమే
# ప్రభుత్వ ప్రాధాన్యం

- భూ రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి
- సర్వే మ్యాప్‌తో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు
- సెప్టెంబర్ 15లోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కాకతీయ, జగిత్యాల : అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తుది జాబితాను సెప్టెంబర్ 15లోగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హతే ప్రామాణికంగా నిజమైన పేదలను గుర్తించి లబ్ధి చేకూర్చాలని సూచించారు. రాష్ట్రంలో చేపడుతున్న భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించి, ప్రతి భూ యజమానికి సర్వే మ్యాప్ అందిస్తే భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

...తరువాయి 2 లో



## సుస్మిత పటేల్ వ్యాఖ్యలపై జంగా రాఘవరెడ్డి ఫైర్

2లో

- సీఎం రేవంత్, ఎమ్మెల్యే రేవూరిపై వ్యాఖ్యలు సరికాదు
- పూర్తి సమాచారం లేకుండా మాట్లాడటం తగదు
- రాజకీయ విమర్శలు ఉండొచ్చు.. వ్యక్తిగత దూషణలు వద్దు
- వాస్తవాలను ప్రజల ముందుంచాలి
- రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- ఇంటి నిర్మాణ అనుమతికి రూ.13వేల లంచం డిమాండ్
- రూ.20 వేలు అడిగి రూ.13 వేలకు బేరం
- మరో కార్యదర్శి ఫోన్‌పే ఖాతాకు నగదు బదిలీ
- ఏసీబీకి చిక్కిన లింగాయపల్లి కార్యదర్శి వరలక్ష్మి



2లో

# మంత్రులకు సీఎం టార్గెట్ అయ్యారా..?

(మొదటి పేజీ తరువాయి)

### సీఎంకు ఎమ్మెల్యేల మద్దతు.. మంత్రులే మౌనం

సుష్మిత వ్యాఖ్యలపై పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తీవ్రంగా స్పందించారు. ఐదుగురు ఎమ్మెల్సీలు, 15 మంది ఎమ్మెల్యేలు సీఎల్పీ వేదికగా మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మహిళా నేతలు కాల్వ సుజాత, ఎర్రబెల్లి స్వర్ణ, ఇందిరాశోభన్ తదితరులు కూడా సుష్మిత వ్యాఖ్యలను తప్పుపట్టారు. దీంతో ముఖ్యమంత్రికి మద్దతుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముందుకు వస్తున్నా.. మంత్రులు మాత్రం ఎందుకు నోరు మెదపడం లేదన్న ప్రశ్న మరింత బలపడింది. ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రిపై విమర్శలు వచ్చినప్పుడు మంత్రివర్గ సహచరులు రాజకీయంగా స్పందించడం సాధారణమే. కానీ ఈ వ్యవహారంలో మాత్రం భిన్నమైన పరిస్థితి కనిపించడం పార్టీ నేతలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

### మంత్రులకు అసంతృప్తి ఉందా?

సీఎంపై సొంత పార్టీకి చెందిన వ్యక్తి తీవ్ర వ్యాఖ్యలు చేసిన సందర్భంలో మంత్రుల మౌనం కేవలం వ్యూహాత్మక మౌనమేనా? లేక మంత్రివర్గంలోనే ఏదైనా అసంతృప్తి ఉందా? అన్న చర్చ మొదలైంది. మంత్రులకు ముఖ్యమంత్రి పట్ల అసంతృప్తి ఉంటే.. అది ఏ అంశాలపై? ప్రభుత్వ నిర్ణయాల విషయంలో సమన్వయం కొరవడిందా? లేక వ్యక్తిగత రాజకీయ సమీకరణాలే కారణమా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే మంత్రుల మౌనం వెనుక అసలు కారణం ఏమిటన్న దానిపై స్పష్టత లేదు. అధికారికంగా ఎవరూ తమ అసంతృప్తిని వ్యక్తం చేయలేదు. దీంతో మౌనాన్ని ఆధారంగా చేసుకుని పార్టీలోనే రకరకాల విశ్లేషణలు సాగుతున్నాయి. ముఖ్యమంత్రికి బహిరంగంగా మద్దతు ప్రకటించకపోవడం మాత్రం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

### సొంత శిబిరం నుంచి మాటలు.. సీఎంకు ఇబ్బందికరమే

ఇప్పటివరకు రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేసే విమర్శలకు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు సమష్టిగా ఎదురుదాడి చేస్తూ వచ్చారు. ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టేందుకు మంత్రులు పోటీపడి మీడియా ముందుకు వచ్చిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు సొంత పార్టీకి చెందిన వ్యక్తి నుంచే సీఎంపై తీవ్ర వ్యాఖ్యలు రావడంతో మంత్రులు స్పందించకపోవడం రాజకీయంగా భిన్నమైన సంకేతాలను ఇస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రికి రాజకీయ రక్షణ కల్పించాల్సిన బాధ్యత మంత్రులపైనే ఉందని పలువురు ఎమ్మెల్యేలు అంటున్నారు. పార్టీ, ప్రభుత్వం రెండింటికీ నాయకత్వం వహిస్తున్న సీఎంపై విమర్శలు వచ్చినప్పుడు మంత్రులు మౌనంగా ఉంటే.. కింది స్థాయి నాయకులు మాత్రం ఎందుకు స్పందించాలన్న ప్రశ్న కూడా కార్యకర్తల్లో తలెత్తుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### బీఆర్ఎస్‌కు దొరికిన రాజకీయ అస్త్రం

కాంగ్రెస్‌లో నెలకొన్న ఈ పరిణామాన్ని బీఆర్ఎస్ రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యమంత్రిపై ప్రతిపక్షాల విమర్శలకంటే సొంత పార్టీ శిబిరం నుంచి వచ్చే వ్యాఖ్యలే ఎక్కువ ప్రభావం చూపుతాయని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కూడా ఇదే కోణంలో కాంగ్రెస్‌పై దాడికి ఉపయోగిస్తున్నారు. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయని, ప్రభుత్వం–పార్టీ మధ్య సమన్వయం దెబ్బతింటోందని బీఆర్ఎస్ వర్గాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వంటి నేతల గత వ్యాఖ్యలను కూడా ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో అసంతృప్తి ఉందన్న వాదనను బలపరచాలని చూస్తున్నాయి. మంత్రుల మౌనం ఈ ప్రచారానికి మరింత ఊతమిచ్చే అవకాశం ఉందన్న ఆందోళన కాంగ్రెస్‌లోని కొందరు నేతల్లో వ్యక్తమవుతోంది.

### క్రమశిక్షణపై అధిష్ఠానం నిర్ణయం?

పార్టీ లైన్ దాటి మాట్లాడే నేతలపై పీసీసీ కఠినంగా వ్యవహరించాలన్న డిమాండ్ కూడా మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రిపై వ్యక్తిగత వ్యాఖ్యలు వచ్చినా చర్యలు లేకపోతే.. భవిష్యత్తులో మరింత మంది నేతలు తమకు నచ్చినట్లు మాట్లాడే అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. గతంలో షోకాజ్ నోటీసులు, వివరణల వరకే వ్యవహారాలు పరిమితమయ్యాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. పార్టీ క్రమశిక్షణను కట్టుదిట్టం చేయడంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకత్వం మధ్య సమన్వయం పెంచాల్సిన అవసరం ఉందని నేతలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా సీఎంపై సొంత పార్టీ నుంచే విమర్శలు వచ్చినప్పుడు నాయకత్వం స్పష్టమైన వైఖరి తీసుకోవాలని కోరుతున్నారు.

### సీఎం రాక తర్వాత ఏం జరుగుతుంది?

ముఖ్యమంత్రి విదేశీ పర్యటన నుంచి తిరిగొచ్చిన తర్వాత ఈ వ్యవహారం ఎలాంటి మలుపు తిరుగుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మంత్రులతో సీఎం ప్రత్యేకంగా చర్చిస్తారా? మంత్రుల మౌనంపై ఆరా తీస్తారా? కొండా సురేఖ వ్యవహారంపై పార్టీ పరంగా ఏదైనా నిర్ణయం తీసుకుంటారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. ఒకవైపు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సీఎంకు మద్దతుగా నిలుస్తుండగా.. మరోవైపు మంత్రుల మౌనం కొనసాగడం పార్టీలో చర్చకు దారితీస్తోంది. మంత్రుల మౌనం నిజంగానే ఏదైనా అసంతృప్తికి సంకేతమా? లేక వివాదాన్ని మరింత పెంచకుండా ఉండేందుకు తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయమా? అన్నది అధిష్ఠానం, మంత్రుల తదుపరి స్పందనతోనే తేలనుంది. మొత్తంగా సుష్మిత వ్యాఖ్యల వివాదం ఇప్పుడు కొండా కుటుంబం–సీఎం మధ్య విభేదాలకే పరిమితం కాకుండా.. మంత్రివర్గంలో నాయకత్వంపై ఉన్న ఏకాభిప్రాయం, ప్రభుత్వంలో సమన్వయం, పార్టీ క్రమశిక్షణకు పరీక్షగా మారింది.

# పేరుకే 24 గంటల ఆసుపత్రి!

- పీహెచ్‌సీలో నిబంధనలకు పాతర
- డిప్యూటేషన్ వైద్యుడితోనే నెట్టుకొస్తున్న వైనం
- సాయంత్రం 4 గంటలకే ఆసుపత్రికి తాళాలు
- వైద్య సేవలు అందక రోగుల అవస్థలు.. చర్యలు తీసుకోవాలి
- :రాయపర్తి మండల ప్రజలు



కాకతీయ, రాయపర్తి : పేరుకు 24 గంటల ఆసుపత్రి.. కానీ సాయంత్రం 4 గంటలకే తాళాలు! అత్యవసర వైద్యం అందించాల్సిన సమయంలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం 24/7 సేవలు అందించేలా ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని వాపోతున్నారు. సాయంత్రం 4 గంటలకే ఆసుపత్రికి తాళాలు వేసి సిబ్బంది వెళ్లిపోతున్నారని, రాత్రి వేళ అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు వైద్యం అందడం లేదని చెబుతున్నారు. రాయపర్తి పీహెచ్‌సీలో పూర్తిస్థాయి రెగ్యులర్ వైద్యుడిని నియమించకుండా అధికారులు డిప్యూటేషన్‌తో కాలం వెళ్లదీస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బానాజీపేటలో మూల పోస్టింగ్ ఉన్న వైద్యుడిని రాయపర్తికి తాత్కాలికంగా పంపి చేతులు దులుపుకొంటున్నారని అంటున్నారు. దీంతో సదరు వైద్యుడు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొందని రోగులు చెబుతున్నారు. 24/7 సేవలు అందించే ఆసుపత్రిలో షిఫ్టుల వారీగా వైద్యులు అందుబాటులో ఉండాల్సి ఉండగా.. ఇక్కడ పూర్తిస్థాయి రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంపై మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు.

### డాక్టర్ ఎక్కడంటే.. సాకులు!

పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్యుడు కనిపించకపోవడంతో ఆయన ఎక్కడున్నారని సిబ్బందిని అడిగితే రకరకాల సమాధానాలు చెబుతున్నారని స్థానికులు అంటున్నారు. క్యాంపునకు వెళ్లారని.. సమావేశానికి వెళ్లారని.. లంచ్‌కు బయటకు వెళ్లారని చెప్పి అసలు విషయాన్ని దాటవేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అత్యవసర సమయంలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంపై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సిబ్బంది సమయపాలన పాటించడం లేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. పీహెచ్‌సీలో రాత్రి వేళ వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు వైద్య ఖర్చుల భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 24/7 ఆసుపత్రిగా ప్రకటించిన పీహెచ్‌సీలో కనీసం అత్యవసర వైద్య సేవలైనా నిరంతరం అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, కలెక్టర్ తక్షణమే స్పందించి రాయపర్తి పీహెచ్‌సీలో 24 గంటలూ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పూర్తిస్థాయి రెగ్యులర్ వైద్యుడిని నియమించడంతో పాటుసిబ్బంది సమయపాలనపాటించేలా పర్యవేక్షణపెంచాలనికోరుతున్నారు.

### సిబ్బంది కొరత ఉంది : మండల వైద్యాధికారి అరుణ్‌చంద్ర

రాయపర్తి పీహెచ్‌సీ పరిస్థితిపై మండల వైద్యాధికారి అరుణ్‌చంద్రను వివరణ కోరగా.. ప్రస్తుతం ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉందని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. 24/7 ఆసుపత్రిలో రోగులకు నిరంతరం సేవలు అందేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

# ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత

కాకతీయ, హైదరాబాద్: ప్రముఖ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కళారంగంలోకి అడుగుపెట్టిన ఆమె.. దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారు. 'షావుకారు' చిత్రంలో అద్భుత నటనతో షావుకారు జానకిగా ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 400కుపైగా చిత్రాల్లో నటించడంతో పాటు హిందీ, మలయాళ సినిమాల్లోనూ తన ప్రతిభను చాటుకున్నారు. షావుకారు జానకిమృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పలు మేటి చిత్రాల్లో ఆమె పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. చలన చిత్ర రంగానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆమె మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. భగవంతుడు ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలనిప్రార్థిస్తూ.. కుటుంబసభ్యులు,అభిమానులకుప్రగాఢసానుభూతి తెలిపారు.

# 'ఖేలో ఇండియా' గేమ్‌చేంజర్

**గ్రాస్‌రూట్ స్థాయి నుంచే క్రీడాకారుల తీర్చిదిద్దడం**

**2026–31 కాలానికి రూ.29,054 కోట్ల కేటాయింపు**

**తెలంగాణలో 33 ఖేలో ఇండియా కేంద్రాలు**

**కొత్త పథకంతో క్రీడారంగం మరింత బలోపేతం: జ్వాలా గుట్టా**




కాకతీయ, హైదరాబాద్ : పునరుద్ధరించిన 'ఖేలో ఇండియా' పథకం భారత క్రీడారంగ స్వరూపాన్ని మార్చే గేమ్‌చేంజర్ అని ఒలింపియన్, మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి జ్వాలా గుట్టా అన్నారు. గ్రాస్‌రూట్ స్థాయి నుంచే ప్రతిభను గుర్తించి క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు క్రీడల్లో నిలకడకు ప్రాధాన్యం ఇవ్వడం ఆశాజనకమన్నారు. 2026–31 కాలానికి పథకానికి రూ.29,054 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గత కేటాయింపులతో పోలిస్తే ఇది సుమారు ఎనిమిది రెట్లు అధికమని, సహాయం పొందే క్రీడాకారుల సంఖ్యను పది రెట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. గ్రాస్‌రూట్ నుంచి ఒలింపిక్ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కోచ్‌ల బోర్డు, అకాడమీల బలోపేతం, మౌలిక వసతులు, స్పోర్ట్స్ టెక్నాలజీకి నిధులు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో ప్రతిభ గుర్తింపు వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో ఇప్పటికే 33 ఖేలో ఇండియా కేంద్రాలు పనిచేస్తున్నాయని, వాటిలో 601 మందికి పైగా క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో 19 ఖేలో ఇండియా గుర్తింపు పొందిన అకాడమీలు ఉన్నాయని వెల్లడించారు.

# యోగితో బండి భేటీ

కాకతీయ, హైదరాబాద్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. యూపీ పర్యటనలో భాగంగా సశస్త్ర సీమా బల్ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం లక్నోలోని సీఎం అధికార నివాసానికి వెళ్లిన బండి సంజయ్.. యోగిని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిద్దరి సమావేశం అరగంటకుపైగా కొనసాగింది. ఈ సందర్భంగా తెలంగాణలో బీజేపీ పరిస్థితి, రాష్ట్ర రాజకీయాలు, యూపీలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. తెలంగాణ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ పూర్తిగా సహకరిస్తున్నారని యోగి పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడితే తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. యూపీలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కొనసాగడంతో మోదీ సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. తెలంగాణలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందని, నాయకులంతా సమష్టిగా పనిచేస్తే అధికారంలోకి రావడం ఖాయమని యోగి ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. యూపీలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ నాయకత్వంలో వరుసగా మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)



శుక్రవారం ఎస్సీ, ఎస్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తదితరులతో కలిసి మంత్రి జగిత్యాల జిల్లాలో పర్యటించారు. జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు, మాల్యాల, మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఆరు కార్యాలయాల నిర్మాణానికి రూ.11.80 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

### అర్హతకే పెద్దపీట

జిల్లాలో మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని పొంగులేటి సూచించారు. ఎల్1, ఎల్2, ఎల్3 వంటి సాంకేతిక వర్గీకరణల కంటే లబ్ధిదారుల అర్హతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. నిజమైన పేదలకు ఇళ్లు అందేలా శాసనసభ్యులు, ఇన్‌చార్జి మంత్రులతో సమన్వయం చేసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. రెండో విడతలో ఒక్క అర్హ కుటుంబం కూడా మిగిలిపోకుండా మరోసారి దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం పారదర్శకంగా ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. వచ్చే నెల 15లోగా తుది జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 10,365 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 8,079 మంది లబ్ధిదారులకు రూ.227.32 కోట్లు విడుదలైనట్లు కలెక్టర్ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రులు ముఖాముఖి నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. 12 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందించారు. చెరువులో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేశారు.

### మ్యాప్‌తో వివాదాలకు చెక్

రాష్ట్రంలో చేపడుతున్న భూ రీ సర్వే అత్యంత కీలకమైన కార్యక్రమమని మంత్రి పొంగులేటి అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే రీ సర్వే లక్ష్యమని, అధికారులు పూర్తి బాధ్యతతో పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత భూ యజమానులకు మ్యాప్ అందిస్తే భవిష్యత్‌లో వివాదాలకు అవకాశం ఉండదని పేర్కొన్నారు. భూ రీ సర్వే రెవెన్యూ శాఖలో కొత్త శకానికి నాంది పలికే కార్యక్రమమని, కలెక్టర్లకు ఇది అనుభవంతో కూడిన ఉన్నత సవాలని అన్నారు. సర్వే నిర్వహించే సర్వేయర్లకు నిర్ణీత మొత్తాన్ని ప్రతి 15 రోజులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

### రిజిస్ట్రేషన్‌లో కొత్త విధానాలు

రిజిస్ట్రేషన్ శాఖలో పాత తరహా విధానాలకు స్వస్తి పలికి ప్రజలకు మరింత సులభతరంగా, పారదర్శకంగా సేవలు అందించే కొత్త విధానాలను తీసుకురాబోతున్నామని మంత్రి తెలిపారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసైన్డ్ భూముల అంశంపై శాసనసభలో విస్తృతంగా చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో తొలి దశలో రూ.32 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. రెండో దశలో పాఠశాల ఏర్పాటుకు నిధులు విడుదల చేస్తామన్నారు. కాలనీలో రేషన్ దుకాణం, బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఆధునిక వసతులతో నిర్మించే కొత్త కార్యాలయాల ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ఎల్.రమణ, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం నో

(మొదటి పేజీ తరువాయి)



సీఎంలు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ క్లియరెన్స్ ఇచ్చే సమయంలో ప్రతిపాదిత కార్యక్రమాలను పరిశీలిస్తామని తెలిపారు. పర్యటన కార్యక్రమం పదవికి, ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని, అమెరికా పర్యటన విషయంలో అది లేదని స్పష్టం చేశారు. కాగా, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి విదేశీ పర్యటనకు బయలుదేరారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 30 వరకు బ్రిటన్, అమెరికాల్లో ఆయన బృందం పర్యటించాల్సి ఉంది. అయితే అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంతో లండన్ పర్యటన ముగించుకుని సీఎం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. మరోవైపు అమెరికా పర్యటనకు అధికారుల బృందాన్ని పంపించాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం.

# శ్రీశైలం నీటిని ఏపీ తరలిస్తున్నా.. చూస్తూ ఊరుకుంటారా?

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం నల్లగొండలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, నేతలు కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డితో కలిసి జగదీశ్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగార్జునసాగర్ నీటిని ఏపీ యథేచ్ఛగా తరలించుకుపోతున్నా జిల్లా మంత్రులు నోరు మెదపడం లేదని విమర్శించారు. తాను ఆధారాలతో సహా ఆంధ్రా నీటి దోపిడీని ప్రజల ముందు ఉంచుతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు.

### రాయలసీమ ప్రాజెక్టులన్నీ నింపుకున్నారు

శ్రీశైలంలో పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని మళ్లించుకుంటున్నారని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. సాగర్ ఓవర్‌ఫ్లో అయి సముద్రంలోకి నీటిని విడుదల చేసిన సమయంలో మాత్రమే పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తీసుకెళ్లాలనే నిబంధన ఉందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆ నిబంధనలను పట్టించుకోకుండా నీటిని తరలించుకుపోతున్నారని అన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తీసుకెళ్లి రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులను నింపుకున్నారని ఆరోపించారు. సాగర్‌లో నీటిమట్టం తక్కువగా ఉన్న సమయంలోనూ తెలంగాణలో సాగుకు నీరు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని జగదీశ్‌రెడ్డి అన్నారు. వరుసగా 17 సార్లు సాగునీరు అందించామని, ఎడమ కాల్వ కింద ఉన్న లిఫ్టులకు కూడా పుష్కలంగా నీటిని విడుదల చేశామని చెప్పారు. ఇప్పుడు సాగర్‌లో నీరు ఉన్నా రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం ఎందుకు కాలయాపన చేస్తోందని ప్రశ్నించారు.




### ఎడమ కాల్వతో పాటు లిఫ్టులకూ నీళ్లు

సాగర్ ఆయకట్టు రైతులకు వెంటనే నీటిని విడుదల చేయాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎడమ కాల్వకు మాత్రమే కాకుండా దాని పరిధిలోని లిఫ్టులకు కూడా నీటిని విడుదల చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో పంటలు సాగవుతున్నప్పుడు తెలంగాణ రైతులకు నీళ్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సాగర్ నీరు తెలంగాణ రైతుల హక్కు అని స్పష్టం చేశారు. జిల్లా మంత్రులు పదవుల భయంతో ఆంధ్రప్రదేశ్‌కు లొంగిపోయి తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని జగదీశ్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గెలిపించి సాగర్ ఆయకట్టు రైతులు తప్పు చేశారని, ఇప్పటికైనా రైతులు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలను గ్రామాల్లో నిలదీసి సాగునీటి కోసం ప్రశ్నించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పటివరకు పోతిరెడ్డిపాడు ద్వారా 148 టీఎంసీల నీటిని తరలించుకుపోయారని అన్నారు. ఇది ఎల్‌నినో వల్ల వచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కరువు అని విమర్శించారు. యాగాల పేరుతో కాలయాపన చేస్తూ రైతులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. శ్రీశైలంలోకి వస్తున్న నీరు ఎక్కడికి వెళ్తుందో అందరికీ తెలుసని, పోతిరెడ్డిపాడు ద్వారా ఆ నీటిని ఆంధ్రాకు తరలిస్తున్నారని అన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను సాధించే వరకు బీఆర్ఎస్ రైతుల తరఫున పోరాడుతుందని స్పష్టం చేశారు. కేసీఆర్‌తో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని, ఎలాగైనా తెలంగాణ నీటి వాటాను సాధిస్తామని జగదీశ్‌రెడ్డి తెలిపారు.

# సుస్మిత పటేల్ వ్యాఖ్యలపై జంగా రాఘవరెడ్డి ఫైర్

**సీఎం రేవంత్, ఎమ్మెల్యే రేవూరిపై వ్యాఖ్యలు సరికాదు**
**పూర్తి సమాచారం లేకుండా మాట్లాడటం తగదు**
**రాజకీయ విమర్శలు ఉండొచ్చు.. వ్యక్తిగత దూషణలు వద్దు**
**వాస్తవాలను ప్రజల ముందుంచాలి**
**రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి**



కాకతీయ, తెలంగాణ బ్యూరో : సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండ సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు సరికావని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. పూర్తి సమాచారం లేకుండా ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై మంత్రి కొండా సురేఖ కూడా తనకు తెలియకుండా ఆ వ్యాఖ్యలు జరిగాయని వివరణ ఇచ్చినట్లు తెలిపారు. రాజకీయాలు ఉండాలని, అయితే వ్యక్తిగత విమర్శలు, తప్పుడు ప్రచారానికి తావుండకూడదని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేయడం కంటే వాస్తవాలను ప్రజల ముందుంచాలని జంగా రాఘవరెడ్డి సూచించారు. రాజకీయ అంశాలపై విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేయడంలో తప్పులేదని, అయితే వ్యక్తిగతంగా విమర్శలు చేయడం వల్ల ప్రజల్లో తప్పుడు అభిప్రాయాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

### సుదర్శన్‌రెడ్డి మృతిని రాజకీయంగా వాడొద్దు

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని జంగా రాఘవరెడ్డి అన్నారు. సుదర్శన్‌రెడ్డి మృతిపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన ఆయన.. హరీశ్‌రావు, కేటీఆర్ చేస్తున్న రాజకీయ ప్రచారం వల్ల ఆయనకు రావాల్సిన సానుభూతి దెబ్బతింటోందని అభిప్రాయపడ్డారు. మరణాన్ని రాజకీయంగా ఉపయోగించుకోకుండా వాస్తవాలను ప్రజల ముందుంచాలని సూచించారు. సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై దొంతి మాధవరెడ్డి రోహిణి ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి గ్రీన్ కారిడార్ ఏర్పాటుకు సహకరించారని పేర్కొన్నారు. ఆయన చేసిన సహాయాన్ని మర్చిపోయి బీఆర్ఎస్ నాయకులు దొంతి మాధవరెడ్డి ఫొటోతో శవయాత్రనిర్వహించడం సరికాదన్నారు. దొంతిమాధవరెడ్డి కాకుండా ఆయన కుమారుడు ఎమ్మెల్యేగా పోటీ చేసినా భారీ మెజారిటీతో గెలిచేలా నర్సంపేట ప్రజల తీర్పు ఉంటుందని వ్యాఖ్యానించారు.

### వైఎస్ఆర్ నగర్ భూముల్లో ప్రజా ప్రయోజన నిర్మాణాలు

కాజీపేటలోని వైఎస్ఆర్ నగర్ కాలనీని ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీయేనని జంగా రాఘవరెడ్డి తెలిపారు. కాలనీలోని భూమిని ప్రభుత్వ భూమిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గుర్తించారని చెప్పారు. కాలనీ వాసులు కొందరు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేను కలిసి ఆవేదన వ్యక్తం చేశారని, స్పందించిన నాయిని.. ఎవరైనా దాడి చేసినా, బెదిరించినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారని తెలిపారు. వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆ భూముల్లో ప్రభుత్వ ఆసుపత్రి, డిగ్రీ కళాశాల, బస్‌స్టాప్, ఏసీపీ కార్యాలయం వంటి ప్రజాప్రయోజన నిర్మాణాలు చేపట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ కాంట్రాక్టర్లతో లాలూచీ పడి సమయాన్ని వృథా చేశారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. నాయిని రాజేందర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఆయన చేస్తున్న అభివృద్ధిని కొందరు ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని జంగా రాఘవరెడ్డి అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని మహిళపై అత్యాచారం

**సిమెంట్ బస్తాలు ఇస్తానంటూ ఇంటికి పిలిచిన గ్రామశాఖ అధ్యక్షుడు**
**భర్తకు తెలియడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ**
**కేసు పెట్టకుండా భూమి ఇస్తామంటూ రాయబారం**
**కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడి**



కాకతీయ, భువనగిరి: ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని చెప్పి ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడం ఆత్మకూరు(ఎం) మండలంలో కలకలం రేపింది. ఓ గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మాలి శంకర్‌రెడ్డి సిమెంట్ బస్తాలు ఇస్తానని మహిళను ఇంటికి పిలిచి అత్యాచారం చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. విషయం బాధితురాలి భర్తకు తెలియడంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినట్లు సమాచారం. పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టకుండా బాధితురాలు, ఆమె భర్తను బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసు పెట్టకుండా అర ఎకరం భూమి ఇస్తామని పెద్దల ద్వారా రాయబారం నడిపినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆత్మకూ రు (ఎం) పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరాలు వెల్లడించారు. ఘటనకుసంబంధించిన పూర్తివివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

# ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

**ఇంటి నిర్మాణ అనుమతికి రూ.13వేల లంచం డిమాండ్**
**రూ.20 వేలు అడిగి రూ.13 వేలకు బేరం**
**మరో కార్యదర్శి ఫోన్‌పే ఖాతాకు నగదు బదిలీ**
**ఏసీబీకి చిక్కిన లింగాయపల్లి కార్యదర్శి వరలక్ష్మి**



కాకతీయ, మంచిర్యాల : ఇంటి నిర్మాణానికి అనుమతి, కొత్తగా నిర్మించిన ఇంటికి ఇంటి నంబర్ కేటాయించేందుకు రూ.13 వేల లంచం తీసుకుంటూ మంచిర్యాల జిల్లా జన్నారం మండలం లింగాయపల్లి పంచాయతీ కార్యదర్శి జె. వరలక్ష్మి ఏసీబీ అధికారులకు చిక్కారు. శుక్రవారం ఆదిలాబాద్ యూనిట్ ఏసీబీ అధికారులు ఈ దాడి నిర్వహించారు. ఏసీబీ వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి నుంచి తొలుత రూ.20 వేలు డిమాండ్ చేసిన వరలక్ష్మి, అనంతరం రూ.13 వేలకు అంగీకరించారు. ట్రాప్ సమయంలో నగదు తీసుకోకుండా ఫోన్‌పే ద్వారా చెల్లించాలని సూచించారు. మరో పంచాయతీ కార్యదర్శి లావణ్యకు చెందిన ఫోన్‌పే నంబర్‌ను ఇచ్చారు. ఆమె సూచన మేరకు ఫిర్యాదుదారుడు రూ.13 వేలను ఆ ఖాతాకు బదిలీ చేశారు. లంచం డిమాండ్, చెల్లింపునకు సంబంధించిన సంభాషణలను ఏసీబీ అధికారులు రికార్డు చేశారు. అనంతరం వరలక్ష్మిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కరీంనగర్‌లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసు దర్యా ప్తులో ఉంది. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

# కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

- మయూరా ఇండియా కార్మికుల సమ్మెకు వి.శ్రీనివాస్‌గౌడ్ మద్దతు
- వేతన ఒప్పందం అమలు చేసి జీతాలు పెంచాలి
- తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
- కార్మిక హక్కులను కాపాడేలా చట్టాలు ఉండాలి
- మాజీ మంత్రి, మయూరా కంపెనీ బీఆర్‌టీయూ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌గౌడ్



కాకతీయ, హైదరాబాద్ : కొంపల్లిలోని మయూరా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కార్మికు లు చేపట్టిన సమ్మెకు మాజీ మంత్రి, మయూరా కంపెనీ బీఆర్‌టీయూ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌గౌడ్ మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయ మైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వేతన ఒప్పందం అమలు చేయడంతో పాటు వేతనాలు పెంచి, బోనస్ చెల్లించాలని కోరారు. వివిధ కారణాలతో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. కార్మికుల శ్రమతోనే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని, వారి హక్కులను విస్మరించడం సరికాదన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్మికుల ఉద్యోగ, వేతన భద్రతకు ప్రభుత్వాలు, యాజమాన్యాలు ప్రాధాన్యం ఇవ్వాలని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కార్మిక సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ నాయకులు జె.సంతోష్‌కుమార్, రాజయ్య, కే.బాలమల్లేష్, కే.నర్సింహులు, కే.మధుసూదన్‌రెడ్డి, ఏ.మహేష్, బి.శ్రీను, సీహెచ్.ప్రసాద్‌రావు, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో ఏ1కు జీవిత ఖైదు

- రూ.3 వేల జరిమానా విధించిన పీడీజే కోర్టు
- ఏ2 జాంబోజి శివ కుమార్ నిర్దోషిగా విడుదల
- దేశ్రాజ్‌పల్లిలో 2023లో మహిళ హత్య
- పకడ్బందీ దర్యాప్తుపై పోలీసు బృందానికి సీపీ అభినందన



కాకతీయ, కరీంనగర్: దేశ్రాజ్‌పల్లి గ్రామంలో 2023 మార్చి 13న జరిగిన మామిడిపల్లి అనిత (50) హత్య కేసులో ఏ1 నిందితుడు తాడగొండ దామోదర్ (34)కు పీడీజే కోర్టు జీవిత ఖైదు, రూ.3 వేల జరిమానా విధించింది. ఏ2 జాంబోజి శివకుమార్ (23)ను నిర్దోషిగా ప్రకటించింది. పీడీజే కోర్టు న్యాయమూర్తి ఎస్.శివకుమార్ ఈ మేరకు తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. అనిత పగటి సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉంటుందనే విషయం తెలుసుకున్న దామోదర్, శివకుమార్‌లు డబ్బు అవసరంతో ఆమెను రూ.30 వేలు అప్పుగా అడిగారు. ఆమె నిరాకరించడంతో హత్య చేసి బంగారు ఆభరణాలు దోచుకోవాలని పథకం వేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం ఇంటికి వెళ్లి హత్య చేసి ఆభరణాలు, ఇతర వస్తువులు తీసుకెళ్లినట్లు ప్రాసిక్యూషన్ కోర్టుకు వివరించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్యాల ప్రతాప్ వాదనలు వినిపించారు. సీసీఆర్బీ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి శ్రీధర్ (రామడుగు), ఏఎస్సై సత్తయ్య, సీఎంఎస్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు. నేరె నిరూపణకు కృషి చేసిన పోలీసు, ప్రాసిక్యూషన్ బృందాలను సీపీ గౌష్ ఆలం అభినందించారు.

# బస్టాండ్ లో టాయిలెట్స్ నిర్మాణానికి స్థల పరిశీలన



కాకతీయ, నెల్లికుదురు: మండల కేంద్రం లోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజల సౌకర్యార్థం టాయిలెట్స్ నిర్మించడానికి స్థలపరిశీలన చేశారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, స్థానిక సర్పంచి పులి వెంకన్న, ఎంపీడీవో సింగారపు కుమార్, మాజీ జెడ్పిటిసి హెచ్ వెంకటేశ్వర్లు తదితరులు బస్టాండ్ ఏరియాలోని సైడ్ కాలువ పక్కన ల్యాండ్ ను గుర్తించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమార్ మాట్లాడుతూ.. బస్టాండ్ ఏరియాలో ఆర్టీసీ సంస్థ గతంలో నిర్మించిన మరుగుదొడ్లు వినియోగించుకునేందుకు వీలుకాకుండా ఉండడంతో బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ప్రజావాణిలో సైతం ఈ మేరకు వినతి పత్రం అందజేశారని పేర్కొన్నారు. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు తక్షణ అవసరమన భావించి స్వచ్ఛభారత్ మిషన్ నిధుల నుంచి స్థానిక గ్రామపంచాయతీ టాయిలెట్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఉపసర్పంచి మంచాల వెంకన్న,పంచాయతీ కార్యదర్శి ఏ.దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలను తాగునీటికే ప్రాధాన్యం

**కృష్ణా బేసిన్‌లో వర్షాభావంపై నిరంతర నిఘా**
**జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు**
**కాలువలు, రెగ్యులేటర్లు, చెరువుల నీటి ప్రవాహంపై పర్యవేక్షణ**
**నీటి లభ్యతను బట్టి చెరువులు నింపాలి : కలెక్టర్ దివాకర టీఎస్**



కాకతీయ, ఏన్కూరు : గోదావరి నుంచి తరలిస్తున్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ వినియోగించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. కృష్ణా బేసిన్‌లో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. శుక్రవారం ఏన్కూరు, కల్లూరు, వేంసూరు మండలాల్లో వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పల్లిపాడు–ఏన్కూర్ మార్గంలో నిమ్మవాగు నుంచి వైరా చెరువుకు చేరుతున్న నీటిని, ఏన్కూరు వద్ద సీతారామ కాలువ 18ఎల్ లింక్ ద్వారా నాగార్జునసాగర్ కాలువకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఎన్ఎస్‌పీ 52వ కిలోమీటర్ వద్ద రెగ్యులేటర్‌ను తనిఖీ చేసి నీటిమట్టం, ప్రవాహ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కల్లూరు మండలం పాయపూర్, బత్తులపల్లి, కప్పలబంధం, వెన్నవల్లి, నేలపాడు, తెలగవరం ప్రాంతాల్లోని కాలువలు, అవుట్‌లెట్లను పరిశీలించారు. వేంసూరు మండలంలోని లంకాసాగర్ చెరువుతో పాటు ఇతర చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహంపై ఆరా తీశారు. కృష్ణా బేసిన్‌లో తక్కువ వర్షపాతం నమోదవుతున్నందున జిల్లాలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లను నిరంతరం తనిఖీ చేస్తూ నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి చెరువులను నింపేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యటనలో ఇరిగేషన్ సీఈ వాసంతి, ఎస్ఈలు ఎం.వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, ఈఈలు బాబురావు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# చక్రపాణి 'దాడి' నాటకం !

- రూ.2 కోట్లకు క్వారీ కొనుగోలు.. రూ.1.80 కోట్లు చెల్లించా
- మిగిలిన రూ.20 లక్షలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా అప్పగించలేదు
- సొసైటీ బిల్లుల డబ్బు డ్రా చేసి మాపై ఆరోపణలు
- ఆరోపణలన్నీ అవాస్తవం.. పోలీసులకు ఫిర్యాదు చేశాం
- టేకులగూడెం ఇసుక సబ్‌కాంట్రాక్టర్ విక్రమ్‌రెడ్డి ఆరోపణలు



కాకతీయ, తెలంగాణ బ్యూరో : బీఆర్ఎస్ నేత, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ చంద చక్రపాణి తనపై దాడి జరిగిందంటూ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, తన కారును తానే ధ్వంసం చేసుకుని తమపై నిందలు వేస్తున్నారని టేకులగూడెం ఇసుక సబ్‌కాంట్రాక్టర్ విక్రమ్‌రెడ్డి ఆరోపించారు. టేకులగూడెం ఇసుక క్వారీని చక్రపాణి నుంచి రూ.2 కోట్లకు కొనుగోలు చేశామని, ఇప్పటికే రూ.1.80 కోట్లు చెల్లించామని తెలిపారు. ఇంకా చెల్లించాల్సిన రూ.20 లక్షలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ క్వారీని తమకు అప్పగించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. శుక్రవారం ములుగులో విక్రమ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఈ వ్యవహారానికి రాజకీయ రంగు పులిమి కాంగ్రెస్ నాయకుల పేర్లను తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. చక్రపాణి కారుపై దాడి జరిగిందన్న వార్తలను మీడియా ద్వారా తెలుసుకున్నానని విక్రమ్‌రెడ్డి తెలిపారు. తాను కరీంనగర్‌లో ఉండగా విషయం తెలియడంతో అసలు వాస్తవాలను వెల్లడించేందుకు విలేకరుల ముందుకు వచ్చినట్లు చెప్పారు. దాడి ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

### రూ.2 కోట్లకు క్వారీ.. రూ.1.80 కోట్లు చెల్లింపు

టేకులగూడెం ఇసుక క్వారీని చక్రపాణి నుంచి రూ.2 కోట్లకు కొనుగోలు చేసినట్లు విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.1.80 కోట్లు చెల్లించామని, మిగిలిన రూ.20 లక్షలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అయినప్పటికీ క్వారీని తమకు పూర్తిగా అప్పగించకుండా చక్రపాణి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సొసైటీకి సంబంధించిన చెక్‌బుక్ విషయంలోనూ చక్రపాణి వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. సొసైటీకి తెలియకుండా చెక్‌బుక్‌ను తీసుకెళ్లి అధ్యక్షుడు, సభ్యుల నుంచి ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై గ్రామంలో పలుమార్లు పంచాయితీలు జరిగినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. సొసైటీకి బిల్లులు వచ్చిన తర్వాత సభ్యుల సమక్షంలో వాటిని పంపిణీ చేయాల్సి ఉండగా చెక్‌బుక్ వ్యవహారం కారణంగా పీవో అధికారులు చెక్కులను రద్దు చేసినట్లు విక్రమ్‌రెడ్డి తెలిపారు. చెక్కులపై రెడ్ పెన్‌తో కొట్టి చెక్‌బుక్‌ను క్యాన్సిల్ చేశారని చెప్పారు. తమకు రావాల్సిన బిల్లుల మొత్తాన్ని కూడా చక్రపాణి తమకు తెలియకుండా డ్రా చేసుకున్నారని ఆరోపించారు. తమకు రావాల్సిన డబ్బులు చెల్లించకుండా, క్వారీని అప్పగించకుండా ఇబ్బందులు పెడుతూ ఇప్పుడు దాడి జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తమ మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలను రాజకీయ వివాదంగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు.

### కాంగ్రెస్ నేతల పేర్లతో రాజకీయ రంగు

తనపై దాడి ఘటనలో కాంగ్రెస్ నాయకుల పేర్లను చక్రపాణి ప్రస్తావించడం పూర్తిగా రాజకీయ ప్రచారంలో భాగమేనని విక్రమ్‌రెడ్డి అన్నారు. పైడాకుల శివకుమార్, లచ్చు పటేల్ తదితరులకు ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. చక్రపాణి ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. బీఆర్ఎస్ నాయకుడు వై.సతీష్‌రెడ్డి తమను ఫోన్‌లో బెదిరిస్తూ ఒత్తిడి తీసుకొచ్చారని కూడా విక్రమ్‌రెడ్డి ఆరోపించారు. తమపై రాజకీయ ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. చక్రపాణి తన కారును తానే ధ్వంసం చేసుకుని తమపై దాడి ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో తమ ప్రమేయం లేదని స్పష్టం చేస్తూ ఎస్పీ కార్యాలయానికి వచ్చి తాము కూడా ఫిర్యాదు చేసినట్లు విక్రమ్‌రెడ్డి తెలిపారు. చెక్‌బుక్ వ్యవహారం, తమకు రావాల్సిన బిల్లుల డబ్బులపై పోలీసులకు వివరాలు అందించామని చెప్పారు. తమకు రావాల్సిన డబ్బులు చెల్లించి, క్వారీని అప్పగించాలని కోరుతున్నామని తెలిపారు. దాడి ఘటనతో తమకు సంబంధం లేదని, చక్రపాణి చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని విక్రమ్‌రెడ్డి తేల్చిచెప్పారు.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం



- అక్టోబర్, నవంబర్‌లో నీటి కొరత రాకుండా ముందస్తు ప్రణాళిక
- భూగర్భ జలాలను అంచనా వేసి పొదుపుగా వినియోగించాలి
- పంటల వైవిధ్యంతో రైతులకు భరోసా
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కాకతీయ, తెలంగాణ బ్యూరో : ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణను సన్నద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్‌డీలో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు వర్షపు నీటి సంరక్షణ, సమీకృత వ్యవసాయ కుంటలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లా డారు. అక్టోబర్, నవంబర్‌లో పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత రాకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలన్నారు. భూగర్భ జలాల లభ్యతను నిరంతరం అంచనా వేస్తూ, అందుబాటులో ఉన్న నీటిని పొదుపు గా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలోని 44 వేల చెరువుల్లోకి వర్షపు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు, నదుల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లతో నీటిని భూగర్భంలోకి ఇంకేలా చూడాలని సూచించారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, వక్క, మిరియాలు వంటి అంతర పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. "ఎల్‌నినో కాదు.. ఎల్‌నినో తాత వచ్చినా తెలంగాణ రైతులను నిలబెట్టగలిగే శక్తి రాష్ట్రానికి ఉండాలి" అని తుమ్మల అన్నారు. కరువు పరిస్థితుల్లో పశువులు, వన్యప్రాణులకు నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామానికి నీటి బడ్జెట్, ప్రతి రైతుకు నీటి భద్రత లక్ష్యంగా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి సీతక్క, మంత్రి వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, అధికారులు పాల్గొన్నారు.

"రాజకీయాల్లోకి రావాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. మంచి బిజినెస్‌మెన్‌గా ఎదగాలనుకున్నా. అన్నయ్య ప్రణయ్‌భాస్కర్ రాజకీయాల్లో ఉన్నప్పుడు ఆయనకు తెరవెనుక నుంచి సహకరించేవాడిని. కానీ ఆయన మరణం తర్వాత హైదరాబాద్‌లో ఎమ్మెల్యే క్వార్టర్ వద్ద ఎదురైన అవమానం నా జీవితాన్నే మార్చేసింది. 'పదవి లేకపోతే ఇంత అవమానమా?' అన్న ఆలోచన నాలో కసిని పెంచింది. ఎమ్మెల్యే అయ్యాకే మళ్లీ అక్కడికి వస్తానని అప్పడే నిర్ణయించుకున్నా. ఆ తర్వాత ఓటములు వచ్చాయి.. అడ్డంకులు ఎదురయ్యాయి.. అయినా వెనక్కి తగ్గలేదు. ప్రజలను, కార్యకర్తలను, కార్మికులను నమ్ముకున్నా. చివరకు ఎమ్మెల్యే అయ్యా. ఇప్పుడు కూడా నేను సీరియస్ పొలిటికల్ లీడర్‌నే. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా.. ఖచ్చితంగా గెలుస్తా" అని మాజీ ఎమ్మెల్యే, మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. తన బాల్యం నుంచి వ్యాపారంపై ఉన్న ఆసక్తి, అన్న ప్రణయ్‌భాస్కర్‌తో అనుబంధం, తనను రాజకీయాల్లోకి నడిపించిన ఆ ఒక్క ఘటన, వరుస ఓటములు, కేసీఆర్‌తో పరిచయం, టీఆర్ఎస్‌తో ప్రయాణం, ప్రజలు–కార్మిక సంఘాలతో ఏర్పడిన మానవ సంబంధాలు, ఉద్యమకారులకు చేసిన సాయం, కల్పలత సూపర్‌బజార్‌తో అనుబంధం, రాజకీయ ప్రత్యర్థులపై తన వైఖరి, కుటుంబ జీవితం, భవిష్యత్ రాజకీయ లక్ష్యాల వరకు ఇంతకుముందు పెద్దగా బయటకు చెప్పని అనేక విషయాలను డిజిటల్ మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పంచుకున్నారు.ఆ వివరాలు ఆయన మాటల్లోనే..!



## బిజినెస్ మెన్ కావాలని కలగన్నాను..!

"మాది పెద్ద ఉమ్మడి కుటుంబం. మా నాన్న విద్యుత్ శాఖలో ఉద్యోగం చేసేవారు. అన్నలు, అక్కలు, తమ్ముళ్లతో కలిసి వడ్డేపల్లిలో పెరిగాను. చిన్నతనంలో ఇంట్లో ఎప్పుడూ సందడిగానే ఉండేది. కుటుంబంలో విలువలు, సంప్రదాయాలతో పెరిగాం. రాజకీయాలంటే ఆసక్తి ఉన్నా.. నాయకుడిని కావాలనే ఆలోచన మాత్రం లేదు. మంచి వ్యాపారవేత్తగా ఎదగాలన్నదే నా లక్ష్యం. అందుకే టెంట్‌హౌస్ నిర్వహించాను. పలు ఏజెన్సీలు తీసుకున్నాను. అప్పట్లో ఇప్పటిలా ఆన్‌లైన్ వ్యాపారాలు లేవు. ఏజెన్సీల ద్వారా వ్యాపారాన్ని విస్తరించాలనుకున్నా. మా అన్న ప్రణయ్‌భాస్కర్ మాత్రం రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. నేను ఆయనకు తెరవెనుక నుంచి సహకరించేవాడిని. 1984లో అన్నయ్య ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ప్రజలతో సంబంధాలు పెంచుకునేందుకు పలు సంఘాలను ఏర్పాటు చేశాం. 1994లో ఆయన ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న సమయంలో ఆయన అకాల మరణంతో మా కుటుంబ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. అయినా నాకు రాజకీయాలపై ఆసక్తి రాలేదు. కుటుంబం, వ్యాపారంపైనే దృష్టి పెట్టాలనుకున్నా."

Chit Chat

## ఓటములు వచ్చాయి.. కానీ నా పట్టుదల తగ్గలేదు

"1999లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాను. 35 వేల ఓట్లు వచ్చాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మంచి మద్దతు లభించింది. అయినా ఓడిపోయాను. 2004లో మాత్రం ఎలాగైనా ఎమ్మెల్యే కావాలని నిర్ణయించుకున్నా. అప్పట్లో టీడీపీ-బీజేపీ పొత్తు కారణంగా నా స్థానాన్ని త్యాగం చేయాలని చంద్రబాబు నాయుడు కోరారు. నామినేటెడ్ పదవి ఇస్తామని చెప్పారు. నేను అంగీకరించలేదు. స్వతంత్రంగా పోటీ చేశాను. ప్రచారానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కేసులు పెట్టారు. ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా వెనక్కి తగ్గలేదు. చివరకు కేవలం 1,400 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆ ఓటమి కూడా నన్ను కుంగదీయలేదు. నా ధైర్యం నా కార్యకర్తలు, ప్రజలే. వారిని నమ్ముకున్నా. ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజల మధ్య నుంచి మాత్రం బయటకు రాలేదు. అదే తర్వాత నా రాజకీయ ప్రయాణానికి బలమైంది."

# ఆ అవమానమే నన్ను ఎమ్మెల్యేను చేసింది

బిజినెస్‌మెన్ కావాలనేది నా చిన్నప్పటి కల

అన్న ప్రణయ్‌భాస్కర్ రాజకీయాల్లో.. నేను తెరవెనుక

ఓటములు ఎన్నైనా.. ఎమ్మెల్యే కావాలన్న పట్టుదల వీడలేదు

కేసీఆర్‌తో పరిచయం..నా జీవితంలో అత్యంత కీలకమైన మలుపు

ఆర్థిక సంబంధాలతో కాదు.. మానవ సంబంధాలతో గెలిచా

2029లో మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తా.. రిటర్న్ గిఫ్ట్ ఇస్తా..!



## ఆ అవమానమే నాలో కసి రేపింది

"అన్నయ్య మరణం తర్వాత వదిన, పిల్లల భవిష్యత్తు కోసం అమ్మానాన్నలతో కలిసి హైదరాబాద్ వెళ్లాను. అన్నయ్యకు కేటాయించిన ఎమ్మెల్యే క్వార్టర్‌కు వెళ్లాం. అక్కడికి వెళ్లేసరికి గదికి సీల్ వేసి ఉంది. ఆ విషయం తెలుసుకునేందుకు క్వార్టర్ నిర్వహణ అధికారులను సంప్రదించాను. ఎస్టేట్ ఆఫీసర్ (ఈవో) వద్దకు వెళ్లి వివరణ అడిగే ప్రయత్నం చేసినప్పుడు 'మీరు ఓడిపోయారు కదా' అంటూ అవమానకరంగా, చాలా నిర్లక్ష్యంగా మాట్లాడారు. ఆయన అన్న మాటలను నన్ను తీవ్రంగా కలచివేశాయి. 'పదవి లేకపోతే ఇంత అవమానమా?' అని అనిపించింది. అదే సమయంలో ఎమ్మెల్యే కావాలనే కసి నాలో మొదలైంది. ఎమ్మెల్యే అయ్యాకే మళ్లీ ఈ ఎస్టేట్‌లో అడుగుపెడుతానని అని అనుకున్నాను. ఆ రోజు జరిగిన ఘటనే నా జీవితానికి మలుపు. కాలం చక్రం గిర్రున తిరిగింది.. 2009లో నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అప్పటికీ రిటైర్డ్ అయిన సదరు అధికారి ఇంటికి స్వయంగా వెళ్లాను. ఆయనను పలకరించి శాలువా కప్పి, స్వీటు ఇచ్చి వచ్చాను. నన్ను అవమానించిన వ్యక్తిపై ప్రతీకారం తీర్చుకోవడం కాదు.. నేను అనుకున్నది సాధించానని చూపించడమే నాకు ముఖ్యం."

## రాజకీయాల్లో కక్ష సాధింపులకు దూరం

"నా రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కొంటా. వారి వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్లడం నా పద్ధతి కాదు. కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగను. కరోనా సమయంలో నేను అధికార పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయ భేదాలు చూడకుండా కాంగ్రెస్ నాయకుల ఇళ్లకు వెళ్లి మందులు, ఇంజెక్షన్లు అందించిన సందర్భాలు ఉన్నాయి. మనిషికి అవసరం ఉన్నప్పుడు అండగా నిలవాలనేదే నా ఆలోచన. అయితే నా మీద చాలా ఆరోపణలు చేశారు. భూకబ్జాలకు పాల్పడ్డానన్నారు. స్విస్ బ్యాంకులో రూ.2 వేల కోట్లు దాచుకున్నానన్నారు. అవి నిజమైతే నిరూపించాలి. ఆరోపణలు చేయడం సులభం. నిరూపించడం ముఖ్యం. రాజకీయాల్లో ప్రత్యర్థిని ఎదుర్కోవచ్చు.. కానీ వ్యక్తిగత కక్షలు పెట్టుకోవడం నా విధానం కాదు."

రాజకీయాల్లో కక్ష సాధింపులకు దూరం

"నా రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కొంటా. వారి వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్లడం నా పద్ధతి కాదు. కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగను. కరోనా సమయంలో నేను అధికార పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయ భేదాలు చూడకుండా కాంగ్రెస్ నాయకుల ఇళ్లకు వెళ్లి మందులు, ఇంజెక్షన్లు అందించిన సందర్భాలు ఉన్నాయి. మనిషికి అవసరం ఉన్నప్పుడు అండగా నిలవాలనేదే నా ఆలోచన. అయితే నా మీద చాలా ఆరోపణలు చేశారు. భూకబ్జాలకు పాల్పడ్డానన్నారు. స్విస్ బ్యాంకులో రూ.2 వేల కోట్లు దాచుకున్నానన్నారు. అవి నిజమైతే నిరూపించాలి. ఆరోపణలు చేయడం సులభం. నిరూపించడం ముఖ్యం. రాజకీయాల్లో ప్రత్యర్థిని ఎదుర్కోవచ్చు.. కానీ వ్యక్తిగత కక్షలు పెట్టుకోవడం నా విధానం కాదు."



## 2005లో కేసీఆర్‌తో పరిచయం.. టీఆర్ఎస్‌లోకి

"తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన సమయంలో 2005లో కేసీఆర్ నన్ను హైదరాబాద్‌కు పిలిచారు. తనతో కలిసి రాజకీయ ప్రయాణం చేయాలని చెప్పారు. తొలుత కార్పొరేటర్‌గా పోటీ చేస్తే పట్టణ ప్రాంతంలోనూ బలం పెరుగుతుందని సూచించారు. 2004లో కేవలం 1400 ఓట్ల తేడాతో ఓడిపోయిన నన్ను కార్పొరేటర్‌గా పోటీ చేయమని చెప్పడం నాకు ఆశ్చర్యం, అసహనం, అసంతృప్తి కలిగించాయి. కానీ కేసీఆర్ చెప్పిన మాటలు ఎందుకనో కన్విన్స్‌గా అనిపించాయి. చివరకు ఒప్పుకోక తప్పలేదు. ఆ తర్వాత టీఆర్ఎస్‌తో నా కొత్త ప్రయాణం మొదలైంది. టౌన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేయూ జంక్షన్ సమీపంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశాను. ఆ కార్యాలయాన్ని కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించాలని అనుకున్నా. కానీ అప్పటికే కొంతమంది నా గురించి ఆయనకు లేనిపోని విషయాలు చెప్పి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. పార్టీ కార్యాలయమే భూ కబ్జా అంటూ చెప్పినట్లు తెలిసింది. అయినా నేను స్వయంగా వెళ్లి కేసీఆర్‌ను ఆహ్వానించాను. పార్టీ కార్యాలయం కోసం నేను పడిన కష్టాన్ని వివరించాను. కార్యాలయం ఓనర్‌ను స్వయంగా పరిచయం చేయడంతో నాపై చెప్పిన మాటలన్నీకూడా అబద్ధాలని తేలిపోవడంతో ఆయన వరంగల్‌కు వచ్చి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ సమయంలో పార్టీ కోసం నేను చేసిన పని, ప్రజల్లో నాకు ఉన్న సంబంధాలు, కార్యకర్తలతో నా అనుబంధాన్ని కేసీఆర్ గమనించారు. అక్కడే నాకు పార్టీ టికెట్ ఖరారైంది. ఆ పరిచయం నా రాజకీయ జీవితంలో మరో కీలక మలుపు."

## "డబ్బుతో కాదు.. మనుషులతో గెలిచా"

"2004లో ఓడిపోయిన తర్వాత నేను డబ్బు, ఆర్థిక వనరులపై ఆధారపడలేదు. ప్రజలు, కార్మికులు, వివిధ సంఘాలతో సంబంధాలను పెంచుకున్నా. మంగలి, ఆటో, ఎల్ఐసీ తదితర సంఘాలతో నాకు అనుబంధం ఏర్పడింది. 44 కార్మిక సంఘాలతో ఐక్యవేదిక ఏర్పాటు చేసి వారి సమస్యల్లో భాగస్వామినయ్యా. అందుకే నేను ఒక విషయం స్పష్టంగా చెబుతా.. నేను ఆర్థిక సంబంధాలతో కాదు.. మానవ సంబంధాలతో గెలిచా. పేదలు, బలహీన వర్గాలు నన్ను ప్రేమగా 'దాస్యం అన్నా' అని పిలవడం అనేది అన్ని పదవుల కన్నా మిన్నా అనిపిస్తుంది..నాకు ఎక్కువ సంతృప్తి ఇస్తుంది. కార్యకర్తలు, ప్రజలు నన్ను తమ మనిషిగా భావించడం వల్లే ఎన్నో ఎన్నికల్లో నాకు అండగా నిలిచారు. నా రాజకీయ జీవితంలో కొన్ని సూత్రాలు పెట్టుకున్నా. కార్యకర్తలకు ఆరోగ్య సమస్య వస్తే అర్ధరాత్రైనా స్పందించాలి. ఆపదలో ఉన్నవారికి అండగా ఉండాలి. పేద విద్యార్థుల చదువుకు సహాయం చేయాలి. కార్యకర్తలను కష్టకాలంలో వదిలిపెట్టకూడదు. కార్మిక, సహకార సంఘాల సమస్యల్లో భాగస్వామి కావాలి. ఇవే నా రాజకీయ బలానికి కారణం."




## కల్పలతతో చిన్ననాటి నుంచే అనుబంధం

"వరంగల్ సెంట్రల్ జైలు ఎదురుగా ఉన్న కల్పలత సూపర్‌బజార్‌తో నాకు చిన్ననాటి నుంచే అనుబంధం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాన్ని మూసివేసే ప్రయత్నాలు జరిగినప్పుడు అడ్డుకున్నా. తెలంగాణ వచ్చిన తర్వాత కల్పలతపై ఉన్న అప్పులను మాఫీ చేయించడంతోపాటు సభ్యత్వాలను పెంచి అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకున్నాం. పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశాం. దాని ద్వారా వచ్చిన ఆదాయాన్ని వినియోగదారులకు ప్రయోజనం చేకూరేలా లాటరీల ద్వారా బహుమతులు అందించాం. సంస్థను నిలబెట్టేందుకు చాలా ప్రయత్నాలు చేశాం. ఇప్పుడు కల్పలతలో అవినీతి జరిగిందని, అందుకు నేనే కారణమని కొందరు ఆరోపిస్తున్నారు. ఆ ఆరోపణల్లో వాస్తవం లేదు. సంస్థ కోసం నేను చేసిన ప్రయత్నాలు అక్కడి వారికి తెలుసు."

"తెలంగాణ ఉద్యమంలో నాతో కలిసి పనిచేసిన ఉద్యమకారులకు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అండగా నిలిచా. కేసుల పాలైనవారికి, గాయపడినవారికి, ఉద్యమంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సాయం చేశా. రైల్వే కేసులతో ఇబ్బందులు పడిన వారికి కూడా ఆర్థికంగా అండగా నిలిచా. కానీ నేను చేసిన సాయాన్ని ఎప్పుడూ ప్రచారం చేసుకోలేదు. మా అమ్మ నాకు చిన్నప్పటి నుంచి ఒక మాట చెప్పేది. 'దానం గుప్తంగానే ఉండాలి. కుడిచేతితో చేసిన సాయం ఎడమ చేతికి కూడా తెలియకూడదు' అనేది. ఆ మాటను ఇప్పటికీ పాటిస్తున్నా. ఎవరికైనా సాయం చేసిన తర్వాత దాన్ని బయట చెప్పుకోవడం నాకు ఇష్టం లేదు. సాయం పొందిన వ్యక్తి మనసులో నేను ఉంటే చాలు."

సాయం చేశా.. ప్రచారం మాత్రం చేసుకోను



## ప్రశాంతతకు మెడిటేషన్

"నా కుటుంబం ఇప్పటికీ ఉమ్మడి కుటుంబంగానే ఉంది. నా శ్రీమతి నాకు అన్ని విధాలుగా అండగా ఉంటుంది. రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా కుటుంబం నా వెంట నిలిచింది. ప్రస్తుతం ఆధ్యాత్మికతపై కూడా ఆసక్తి పెరిగింది. మెడిటేషన్ చేస్తున్నా. రాజకీయాల్లో ఒత్తిళ్లు సహజం. మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి మెడిటేషన్ ఉపయోగపడుతోంది. మనం ఎంత ఎత్తుకు వెళ్లినా కుటుంబం, మనుషులతో ఉన్న సంబంధాలను మర్చిపోకూడదు."

## 2029లో 'రిటర్న్ గిఫ్ట్' ఇస్తా

"నా రాజకీయ జీవితంలో ఎదురైన ఓటముల నుంచి చాలా నేర్చుకున్నా. ఎక్కడ తప్పు జరిగిందో గుర్తించా. వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నా. ఓటమి నన్ను ఆపలేదు.. మరింత బలంగా చేసింది. నేను సీరియస్ పొలిటికల్ లీడర్‌ను. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తా. ఖచ్చితంగా గెలుస్తా. ప్రజలు, కార్యకర్తలతో ఉన్న అనుబంధమే నా బలం. నేను రాజకీయాల్లోకి వచ్చిన రోజునుంచి ప్రజలతోనే ఉన్నా. 2029లో నా 'రిటర్న్ గిఫ్ట్' ఉంటుంది. అది చిల్లర రాజకీయాలతో కాదు.. నా పనితీరుతో ఉంటుంది. నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చింది ఒక అవమానం కావచ్చు. కానీ నన్ను నిలబెట్టింది మాత్రం ప్రజలు, కార్యకర్తలు, మానవ సంబంధాలే. ఇక ముందు కూడా అదే బలంతో ముందుకు వెళ్తా."

-అరెల్లి కిరణ్ గౌడ్
7396604266

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266

# బాలికల హాస్టల్ నుంచి దుర్గంధం

## పట్టించుకోని వార్డెన్, అధికారులపై స్థానికుల ఆవేదన



కాకతీయ, ఏటూరునాగారం రూరల్ : ఏటూరునాగారం మండల కేంద్రంలోని తాళ్లగడ్డ ఆశ్రమ పాఠశాలలో సమస్యలు పరిష్కరించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికుడు కందకట్ల సతీష్ ఆరోపించారు. పాఠశాల ప్రాంగణంలోని పైపులు పగిలిపోవడంతో పాటు గోడ కూలిపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం ఇళ్లలోకి వస్తోందన్నారు. గోడ కూలి చాలాకాలమైనా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్ లింగయ్యకు పలుమార్లు తెలిపినా స్పందించలేదన్నారు. ఐటీడీఏ ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవన్నారు. కూలిన గోడ, పగిలిన పైపులు, దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని కందకట్ల సతీష్ కోరారు.

# కొత్తపల్లి క్రీడాకారులు రాష్ట్రానికి గర్వకారణం : కేకే మహేందర్‌రెడ్డి

## రాష్ట్రస్థాయి త్రోబాల్ విజేతలకు సన్మానం



కాకతీయ, గంభీరావుపేట : కొత్తపల్లి గ్రామ క్రీడాకారులు రాష్ట్రానికే గర్వకారణమని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో విజయం సాధించిన కొత్తపల్లి మహిళా క్రీడాకారులు స్వాతి, హారిక, దేవీప్రియలను శుక్రవారం సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. క్రీడాకారుల ఎదుగుదలకు తోబుట్టువులా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హనుమాండ్లు, మండల మాజీ అధ్యక్షుడు హమీద్, నాయకులు రాజ నర్సింహారెడ్డి, ఎలుక రాజు, గంగిస్వామి, ఆజం, రాజం, రాజారాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, గణేష్, దేవగౌడ్, రాజయ్య, శ్రీనివాస్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌కు మద్దతుగా

# రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం



కాకతీయ, చిగురుమామిడి : ఇందుర్తి గ్రామ ఉపసర్పంచ్ చింతపూల అనిల్‌ను రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్ శుక్రవారం పరామర్శించారు. రాష్ట్రంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 100 మంది ఉపసర్పంచులతో కలిసి ఇందుర్తికి వచ్చారు. పంచాయతీలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నిస్తున్న ఉపసర్పంచ్‌ను మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సిబ్బంది జీతాల బిల్లులకు ఇతర బిల్లులను ముడిపెట్టి, ముందుగా అన్నింటిపై సంతకాలు చేసిన తర్వాతే జీతాల బిల్లులపై సంతకం చేయాలని కార్యదర్శి స్వర్ణలత ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కరీంనగర్ డీపీఓ స్పందించి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దూస కుమార్, గోపగోని నవీన్‌కుమార్ గౌడ్, ఆకుబత్తిని విజయ్‌కుమార్, పండుగ హరీష్ ముదిరాజ్, తిరుపతి, కిరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# జీవో 97 రద్దు చేయాలి

## పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా, ర్యాలీ



కాకతీయ, చేర్యాల: పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ/శక్తి పరిధిలోకి విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేర్యాలలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులు ధర్నా, భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు ఒగ్గు శ్రీశైలం మాట్లాడుతూ జీవో 97తో పాలిటెక్నిక్ విద్యార్థుల సర్టిఫికెట్ల విలువ, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను స్వతంత్రంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. జీవో 97ను వెంటనే రద్దు చేయకపోతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ఘనంగా ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం



కాకతీయ, ఖమ్మం టౌన్ : జిల్లా సంస్థ డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో వయోవృద్ధుల సంఘం సహకారంతో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస మాట్లాడుతూ వయోవృద్ధుల కోసం అమలవుతున్న చట్టాలు, సంక్షేమ పథకాలు, నాల్సా పథకాలపై అవగాహన కల్పించారు. వృద్ధులకు గౌరవప్రదమైన జీవితం, న్యాయం, భరణం, వేధింపులేని జీవనం కల్పించడమే లక్ష్యమన్నారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం, ఉచిత న్యాయ సహాయం, హెల్ప్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, వయోవృద్ధుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# చంతయ్యపల్లిలో సమస్యలకు తక్షణ పరిష్కారం

**గౌరవెల్లి పూర్తి చేసి కాలువల ద్వారా సాగునీరు**

**చంతయ్యపల్లి స్టేజి నుంచి గ్రామానికి నెల రోజుల్లో రోడ్డు**

**ఆయిల్‌ఫామ్‌తో రైతులకు అధిక ఆదాయం**

**: మంత్రి పొన్నం ప్రభాకర్**



కాకతీయ, వరంగల్ బ్యూరో : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణమే పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం చంతయ్యపల్లిలో నిర్వహించిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న.. పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి కాలువల ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గ రైతులకు సాగునీరు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేయకపోతే ఓట్లు అడగనని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటల తో పాటు ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులు దృష్టి సారించాల ని సూచించారు. జలసిరి కింద ఇంకుడు గుంతలకు రూ. 6,500, ఫామ్ పాండ్లకు రూ.1.30 లక్షల వరకు ప్రభుత్వం సాయం చేస్తుందని తెలిపారు. గ్రామంలో చంతయ్యపల్లి స్టేజి నుంచి ప్రధాన రహదారి పనులను నెల రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అంతర్గత సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనం, పంచాయతీ భవనంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి అవసరమైన వసతులు కల్పిస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సునీత, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# పెద్ది విగ్రహ ధ్వంసంపై బీఆర్ఎస్ ఫైర్



**మాధవరెడ్డిపై సూటిగా ప్రశ్నలు.. బాధ్యత ఎవరిది?**

**కమిషనర్‌ను సస్పెండ్ చేస్తే పాలాభిషేకం**

**లేదంటే విగ్రహం కూల్చినందుకు క్షమాపణ చెప్పాలి**

**నెక్కొండలో బీఆర్ఎస్ ప్రెస్‌మీట్**

కాకతీయ, వరంగల్ ప్రతినిధి: నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ధ్వంసంపై బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నెక్కొండలో మండల అధ్యక్షుడు సంగని సూరయ్య నేతృత్వంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఉద్దేశించి, ఆయన పుట్టినరోజునే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఎందుకు కూల్చారని ప్రశ్నించారు. ఘటనతో సంబంధం లేదని చెబుతున్నప్పుడు నర్సంపేట మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్‌ను సస్పెండ్ చేస్తే మాధవరెడ్డికి పాలాభిషేకం చేస్తామని, లేదంటే విగ్రహం తొలగింపుపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి అనారోగ్యంతో ఉన్న సమయంలో మాధవరెడ్డి పరామర్శకు వచ్చినా ఎవరితోనూ మాట్లాడకుండా వెళ్లిపోయారని విమర్శించారు. అంతిమ యాత్రకు భారీగా ప్రజలు తరలిరావడంతోనే ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిందన్నారు. దీనిని మాధవరెడ్డి చేయించారని చెప్పుకోవడం సరికాదన్నారు. విగ్రహం తొలగింపుపై నిరసన తెలిపిన వారిని బెదిరించడం అప్రజాస్వామికమని విమర్శించారు. సమావేశంలో కొమ్ము రమేష్ యాదవ్, జాటోత్ రమేష్ నాయక్, తాటిపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ-ఎన్‌డబ్ల్యూఆర్‌తో రైతులు, వ్యాపారులకు ప్రయోజనం

**డబ్ల్యూడీఆర్ఏ నిబంధనలపై ఛాంబర్‌లో అవగాహన**

**గోదాముల రిజిస్ట్రేషన్‌పై అధికారుల వివరణ**

**పంటను నిల్వ చేసి మంచి ధరకు విక్రయించే అవకాశం**

**రైతులకు 7 శాతం వడ్డీతో రూ.75 లక్షల వరకు రుణం**




కాకతీయ, వరంగల్ ప్రతినిధి : డబ్ల్యూడీఆర్ఏ నిబంధనలు, ఈ–ఎన్‌డబ్ల్యూఆర్ విధానాలపై వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఛాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, డీసీఓ నీరజ, డీఎంఓ నాగరాజు, ఎస్‌బీఐ ఆర్ఎం సుబ్బారావు, డబ్ల్యూడీఆర్ఏ ప్రతినిధి అవినాష్ పాండే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ–ఎన్‌డబ్ల్యూఆర్ విధానం రైతులు, వ్యాపారులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలను తొలగించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయాలని, బ్యాంకులు జాప్యం లేకుండా ప్లెడ్జ్ రుణాలు మంజూరు చేయాలని కోరారు. అధికారులు మాట్లాడుతూ బీఐఎస్, ఎఫ్‌సీఐ ప్రమాణాలు కలిగిన గోదాములకే ఐదేళ్ల రిజిస్ట్రేషన్ ఇస్తామని తెలిపారు. ఎన్ఈఆర్ఎల్, సీసీఆర్ఎల్ ద్వారా ఈ–ఎన్‌డబ్ల్యూఆర్ రసీదులు జారీ అవుతాయని వివరించారు. రైతులు పంటను తక్కువ ధరకు విక్రయించకుండా నిల్వ చేసి గిట్టుబాటు ధర వచ్చినపుడు అమ్ముకోవచ్చన్నారు. నిల్వపై 7శాతం వడ్డీకే రూ.75 లక్షల వరకు రుణం, వ్యాపారులకు రూ.2 కోట్ల వరకు గ్యారెంటీ సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఛాంబర్ సభ్యులు, గోదాంనిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

# 45 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

**పీడీఎస్ బియ్యం అక్రమ డంపింగ్.. వ్యక్తి అరెస్ట్**

**90 తెల్ల సంచుల్లో నిల్వ చేసిన పీడీఎస్ బియ్యం**

**రూ.1.57 లక్షల విలువైన సరుకు పట్టివేత**

**టాస్క్‌ఫోర్స్, కేయూసీ పోలీసుల సంయుక్త దాడి**



కాకతీయ, హనుమకొండ : అక్రమంగా డంప్ చేసిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. హనుమకొండలోని కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఈ దాడి జరిగింది. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కేయూసీ పోలీసులతో కలిసి కొమెటిపల్లి తండా, వడ్డేపల్లిలోని గంటా జన్నయ్య (40) ఇంటిపై దాడి చేశారు. ఈ తనిఖీల్లో 90 తెల్ల సంచుల్లో ఉన్న సుమారు 45 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యం విలువ సుమారు రూ.1,57,500గా అధికారులు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి డంప్ చేస్తున్నట్లు గుర్తించి జన్నయ్యను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యంతో పాటు నిందితుడిని తదుపరి చర్యల నిమిత్తం కేయూసీ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఏసీపీ ఎ.మధుసూదన్, ఇన్‌స్పెక్టర్‌జి.బాబులాల్‌తోపాటుటాస్క్‌ఫోర్స్‌సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంజీఎంలో గుర్తుతెలియని మహిళ మృతి

**దాసరి స్వరూపగా పేరు చెప్పి ఆసుపత్రిలో చేర్పించిన వ్యక్తి పరార్**



కాకతీయ, వరంగల్: గుర్తుతెలియని మహిళ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వరంగల్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 21న అర్ధరాత్రి సుమారు 1.20 గంటలకు ఓ వ్యక్తి అనారోగ్యంతో ఉన్న మహిళను ఎంజీఎం ఆసుపత్రికి తీసుకొచ్చాడు. ఆమె పేరు దాసరి స్వరూప, భర్త నరసయ్య, వయసు 50 ఏళ్లుగా వైద్య సిబ్బందికి తెలిపి, పూర్తి చిరునామా, ఇతర వివరాలు ఇవ్వకుండానే వెళ్లిపోయాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రాథమికంగా అనారోగ్య కారణంగానే మృతి చెందినట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతురాలు వంకాయ రంగు జాకెట్, పసుపు రంగు పూలతో కూడిన పచ్చని చీర ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమెను గుర్తించిన వారు లేదా బంధువుల వివరాలు తెలిసిన వారు మట్వాడ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్సై: 8712685090, సీఐ: 8712685117 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

## బంగారు, వెండి నగలు

# దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

## రూ.2.42 లక్షల విలువైన నగలు స్వాధీనం : ఆత్మకూరు సీఐ సంతోష్



కాకతీయ, ఆత్మకూరు : ఇంట్లో బంగారు, వెండి నగలు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆత్మకూరు సీఐ సంతోష్ తెలిపారు. శుక్రవారం పెద్దాపూర్ గ్రామంలో వాహనాల తనిఖీల్లో నాగనబోయిన శివరాజ్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. సీఐ వివరాల ప్రకారం.. ఆస్తి వివాదాల నేపథ్యంలో నాగనబోయిన రవి ఇంట్లో సుమారు రూ.2.42 లక్షల విలువైన బంగారు, వెండి నగలు దొంగిలించి, అనంతరం ఇంటికి నిప్పంటించినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, నగలతో పాటు హోండా ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అరెస్టులో ఎస్సై తిరుపతి, కానిస్టేబుళ్లు కటకం శ్రీనివాస్, జన్ను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వై-జంక్షన్‌లో వ్యక్తి మృతదేహం



కాకతీయ, ఏటూరునాగారం రూరల్: ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై–జంక్షన్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఓ ఇంట్లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఇంటి యజమాని లోటపేటల పాపయ్య సమాచారం మేరకు మధ్యాహ్నం ఒంటి గంటకు పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని వాజేడు మండలం చీకుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వీరాపురం గ్రామానికి చెందిన మోడెం శేషయ్య (50)గా గుర్తించారు. ఆయన కోయ (ఎస్టీ) సామాజిక వర్గానికి చెందిన కూలీ అని ఏటూరునాగారం ఎస్సై మహేష్ తెలిపారు. శేషయ్య నాలుగేళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటూ ఏటూరునాగారంలో దినసరి కూలీగా పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, ఘటనపై తదుపరి చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు

- క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ తప్పనిసరిగా పాటించాలి
- నర్సంపేటలో రెండు ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు
- రికార్డులు, రిజిస్టర్ల పరిశీలన : డీఎంహెచ్ఓ డా. బి. రాజారెడ్డి



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి స్పష్టం చేశారు. గురువారం డీఐఓ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ఐ. ప్రకాశ్‌తో కలిసి నర్సంపేటలోని వీఎస్ఆర్, అవని ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ 2011 చట్టం, 2022 నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ లేకుండా ఆసుపత్రులు నిర్వహించరాదన్నారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు పాటించాలని, ఫైర్ సేఫ్టీ చర్యలు చేపట్టడంతో పాటు ఎక్స్‌టింగ్విషర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్ఓ ప్రసన్నకుమార్, ఎల్‌డీ కంప్యూటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అత్యవసర వేళల్లో వాకీటాకీలు : కమిషనర్ వెంకన్న

## బల్దియా అధికారులకు వాకీటాకీల పంపిణీ



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: రోజువారీ విధులతో పాటు అత్యవసర వేళల్లో అధికారుల మధ్య వేగవంతమైన సమన్వయానికి వాకీటాకీలను సమర్థంగా వినియోగించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న సూచించారు. శుక్ర వారం బల్దియా కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులకు వాకీటాకీలను పంపిణీ చేశారు. భారీ వర్షాలు, వరదలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో సెల్‌ఫోన్‌కు బదులుగా వాకీటాకీల ద్వారా సమాచారాన్ని వేగంగా చేరవేయవచ్చన్నారు. అధికారులు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి వాకీటాకీల వినియోగాన్ని పెంచాలని సూచించారు.

# సెప్టెంబర్ 28న ఖమ్మంలో ఏఐకేఎంఎస్ భారీ సభ




కాకతీయ, కారేపల్లి : సెప్టెంబర్ 28న ఖమ్మంలో నిర్వహించే అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) భారీ బహిరంగ సభ, 29, 30 తేదీల్లో జరిగే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ప్రకాష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం లెనిన్‌నగర్‌లోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బజ్జూరి వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రకాష్ మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కూలీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు పెంచాలని, రైతు వ్యతిరేక వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభల్లో రైతు కూలీల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మందుల రాజేంద్రప్రసాద్, ఎం. గిరి, ఎస్.కె. కాసిం, లింగన్న, మురళి, అప్పారావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.